భద్రత కట్టుదిట్టం చేయాలి



ఇటీవల కోల్‌కతాలో జరిగిన ఘటన పునరావృతం కాకుండా ఉండేందుకు ఆసుపత్రుల్లో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలి. జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. మహిళా వైద్యులు, ఏఎన్‌ఎంలకు అండగా నిలవడంతో పాటు అన్ని వసతులతో రక్షణ కల్పించాలి. నేరాలకు పాల్పడిన వారికి విధించే శిక్ష మరొకరికి దడ పుట్టించేలా ఉండాలి.

– డాక్టర్ షాజియా సుల్తానా, జనని హాస్పిటల్స్, ఏలూరు

కఠిన శిక్షలు విధించాలి



మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తున్న వారికి వేసే శిక్షలు కఠినంగా ఉండాలి. మరొకరు ఆ తప్పు చేయాలంటే భయపడేలా విధంగా శిక్ష అమలు చేయాలి. న్యాయస్థానాలు కూడా ఇలాంటి కేసుల్లో కాలయాపన చేయకుండా వీలైనంత త్వరగా శిక్షలను అమలు చేయాలి. అందుకు అవసరమైన చట్టాలను తీసుకురావాలి. అప్పుడే మహిళలకు ధైర్యం ఏర్పడుతుంది.

– నెరుసు సాయిశ్రీవల్లి, మహిళా వైద్యురాలు

క్లుప్తంగా

జూనియర్ అసిస్టెంట్ ప్రసాద్‌కు ఎస్పీ పరామర్శ



ప్రసాద్‌ను పరామర్శించిన ఎస్పీ ప్రతాప శివకిషోర్

ఏలూరు టౌన్: కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోన్న ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ వైఎస్వీ ప్రసాద్‌ను ఎస్పీ కొమ్మి ప్రతాప శివ కిషోర్ పరామర్శించారు. ప్రసాద్ ఇంటికి ఎస్పీ వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలని, పోలీస్ యూనిట్ హాస్పిటల్ వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఎస్పీ తమ ఇంటికి వచ్చి పరామర్శించటం పట్ల కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలోని కొమడవోలు – ఆటోనగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, లైన్ల వార్షిక మరమ్మతుల నిమిత్తం ఈ నెల 30న వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ జేవీబీ నటరాజన్ తెలిపారు. ఆటోనగర్, కొమడవోలు, తూర్పు లాకులు, సాయి నగర్ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఏలూరు టౌన్: రోడ్డులో ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 20వ తేదీ రాత్రి జంగారెడ్డిగూడెం రోడ్డులో ఒక విద్యా సంస్థ సమీపంలో రోడ్డుపై వెళుతున్న సుమారు 50 నుంచి 55 సంవత్సరాల వయస్సు ఉన్న వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొనటంతో తీవ్రగాయాలపాలయ్యాడు. అతన్ని స్థానికులు 108 వాహనంలో సర్వజన ఆసుపత్రికి తరలించగా వైద్యం పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఏలూరు రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

యువతి అదృశ్యం

ఏలూరు టౌన్ : ఏలూరు శనివారపు పేట ప్రాంతానికి చెందిన యువతి అదృశ్యంపై ఏలూరు త్రీ టౌన్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. శనివారపు పేట కుమ్మరివీధికి చెందిన యువతి (20) చదువుకుని ఇంటి వద్దే ఉంటుంది. ఆమె ఈనెల 27 సాయంత్రం 4 గంటలకు ఇంటి నుంచి బయటకెళ్లి కనిపించకుండాపోయింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు మిస్సింగ్ కేసు దర్యాప్తు చేపట్టారు.

ఆహ్లాదం ఆవిరి

- పార్కుల నిర్వహణపై నిర్లక్ష్యం
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం
- బడ్జెట్లో నిధుల కేటాయింపు శూన్యం

ఏలూరు (టూటౌన్) : ఏలూరు నగర పార్కుల నిర్వహణను గాలికొదిలేశారు. ఆహ్లాదాన్ని పంచాల్సిన పార్కులు నేడు వెలవెలబోతున్నాయి. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. 2024–25 నగర పాలక సంస్థ బడ్జెట్లో నగరంలోని పార్కుల అభివృద్ధికి ఒక్క పైసా కూడా కేటాయించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పార్కుల సర్వతో ముఖాభివృద్ధికి కృషి చేయాలని నగరవాసులు ముక్త కంఠంతో కోరుతున్నారు.

నాడు స్వర్ణయుగం

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన సంజయ్ జాజు హయాంలో నగరంలోని పార్కులకు స్వర్ణయుగంగా చెప్పవచ్చు. నాడు ఏలూరు నగరంలోని ప్రధానంగా ఉన్న 14 పార్కుల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులను వెచ్చించారు. పార్కుల చుట్టూ సిమెంట్ డిజైన్లు, పార్కు లోపల వాకింగ్ ట్రాక్, చిన్నారుల ఆటవిడుపు కోసం ఊయలలు, జారుడు బల్లలు ఇలా రకరకాల హంగులను కల్పించారు. ఏలూరు మెయిన్ రోడ్డును ఆనుకుని ఉన్న కృష్ణా కెనాల్ వెంబడి సైతం సిమెంట్ డివైడర్లను ఏర్పాటు చేసి రంగులతో తీర్చి దిద్దారు. జాతీయ పండుగల సమయంలో రకరకాల విద్యుత్ లైటింగ్‌లు అమర్చారు. దీంతో నగరానికే ఒక విధమైన కళ వచ్చింది.

45 వేల మంది చిన్నారులు

ఏలూరు నగర జనాభా సుమారు మూడు లక్షలు. వీరిలో 15 శాతం అంటే సుమారు 45 వేల మంది వరకు 15 సంవత్సరాలలోపు బాలబాలికలు ఉన్నారు. వీరందరికీ సెలవు రోజుల్లో ఆహ్లాదాన్ని పంచేందుకు సరైన పార్కుల సదుపాయం లేదు. ప్రధానంగా ఆర్‌ఆర్‌పేట ఎన్టీఆర్ పార్కు, పత్తేబాద బృందావనం పార్కు, ఏటిగట్టున ఉన్న జన్మభూమి పార్కులు కొద్దిగా చిన్నారులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. మిగతా పార్కులన్నీ శిథిలావస్థకు చేరి వెలవెలబోతున్నాయి. పనికొచ్చే రెండు, మూడు పార్కులు సెలవు రోజుల్లో చిన్నారులకు పూర్తిస్థాయిలో సరిపోయే పరిస్థితి లేదు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..

నగరంలో ఎటువంటి అభివృద్ధికీ నోచుకోని కొన్ని పార్కులు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. కాలేజీకి దుమ్మా కొట్టిన విద్యార్థులు, ప్రేమ జంటలు, పిక్ పాకెటర్స్, మందుబాబులకు ఇవి కేరాఫ్ అడ్రస్‌గా మారిపోయాయి. ఏటిగట్టు ప్రాంతంలోని జన్మభూమి పార్కులో పట్టపగలే మందుబాబులు విచ్చలవిడిగా మద్యం సేవిస్తున్నారు. వీరిని అదమాయించే వారు కరువవ్వడంతో ఆ మార్గంలో వెళ్లేవారు ఔరా అంటూ ముక్కున వేలేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.



శిథిలమైన జన్మభూమి పార్కు



జన్మభూమి పార్కులో పాడైపోయిన ఆట వస్తువు



టీటీడీ కల్యాణ మండపం ఎదురుగా ఉన్న పార్కు ముఖద్వారం



టీటీడీకి ఎదురుగా ఉన్న పార్కులో పాడైపోయిన వాటర్ పౌంటెయిన్

అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి



ఏలూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఉన్న పార్కుల అభివృద్ధికి చర్యలు చేపట్టాలి. ఇందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలి. నగరంలోని చిన్నారులకు, పెద్దలకు, వృద్ధులకు ఆటవిడుపుగా ఉండే పార్కుల అభివృద్ధిపై నిర్లక్ష్యం తగదు. కుటుంబమంతా కలిసి పార్కులో సేదతీరే విధంగా వాటిని వినియోగంలోకి తీసుకురావాలి.

– పి.కిషోర్, ఏలూరు నగర కార్యదర్శి, సీపీఎం

నిధులు కేటాయించాలి



2024–25 నగరపాలక సంస్థ బడ్జెట్లో పార్కుల అభివృద్ధికి నిధులు కేటాయించాలి. అన్నీ ఒకేసారిగా కాకపోయినా, ప్రతి ఏటా కొన్ని చొప్పునైనా పార్కులను అభివృద్ధి చేయడం ద్వారా నగరంలోని చిన్నారులకు ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవాలి. పార్కుల్లో అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలి.

– బండి వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు, ఏలూరు

చిన్నారులకు రక్తమార్పిడి చికిత్స



చిన్నారులకు ప్రొటీన్ పౌడర్, పండ్లు అందిస్తున్న దృశ్యం

ఏలూరు టౌన్: ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ప్రాంగణంలోని రెడ్‌క్రాస్ తలసేమియా భవనంలో 9 మంది తలసేమియా బాధిత చిన్నారులకు రక్తమార్పిడి చికిత్స నిర్వహించామని జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి తెలిపారు. తలసేమియా, సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి చిన్నారుల కోసం రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బాధిత చిన్నారులకు ప్రతి బుధవారం రెడ్ క్రాస్ భవనానికి వచ్చి రక్త మార్పిడి చికిత్స చేయించుకోవాలని కృష్ణారెడ్డి కోరారు. చిన్నారులు, వారి సహాయకులు 25 మందికి నెక్కంటి రామచంద్రరావు, సీతామహాలక్ష్మి దంపతులు మధ్యాహ్నం భోజనం ఏర్పాటుచేయగా, ఏలూరు రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఎన్వీవి బి.స్వామి ప్రొటీన్ పౌడర్, పండ్లను అందజేశారని, వీరికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కే వరప్రసాదరావు, చిన్న పిల్లల వైద్యుడు పీఏఆర్ఎస్ శ్రీనివాస్, డాక్టర్ జి.స్పందన, సీఆర్ఆర్ డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ ఎస్వీవీఎస్ ప్రసాద్, రోటరీ క్లబ్ సభ్యులు ఎన్వీవీబీ స్వామి, బి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల పట్ల ఇంటర్మీడియేట్ బోర్డ్ వివక్ష

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఈనెల 31 నుంచి ఇంటర్మీడియేట్ బోర్డు నిర్వహించే సెకండ్ యూనిట్ పరీక్షలకు సంబంధించి బోర్డు విద్యార్థుల పట్ల వివక్ష చూపుతోందని ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దిద్దే అంబేద్కర్ ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రశ్న పత్రాలు ప్రభుత్వ, ఎయిడెడ్ జూనియర్ కాలేజీలకు మాత్రమే పంపుతామని, ప్రైవేట్ కాలేజీలు వాళ్లే సొంతగా ప్రశ్న పత్రాలు తయారు చేసుకోమని బోర్డు వారు చెప్పడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పేర్కొన్నారు. ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు చేస్తున్న అక్రమాలపై ఇంటర్మీడియేట్ బోర్డుకు అనేకసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, ఇప్పుడు ప్రశ్నా పత్రాలను ప్రైవేటు కాలేజీలు సొంతగా తయారు చేసుకోమని చెప్పడం అంటే వారి అక్రమాలను బోర్డు ప్రోత్సహించడమేనని ఆరోపించారు. గత మార్చిలో జరిగిన పబ్లిక్ ఎగ్జామ్స్‌లో పనిచేసిన జూనియర్ లెక్చరర్స్‌కు రావాల్సిన రెమ్యూనరేషన్ డబ్బులు ప్రభుత్వం జోక్యం చేసుకొని ఇంటర్మీడియట్ బోర్డ్ నుంచి ఇప్పించాలని డిమాండ్ చేశారు.

మహిళల సంరక్షణే ధ్యేయం



డీఎస్పీ శ్రావణ్‌కుమార్‌కు పూలకుండీని ఇస్తున్న సీఐ కోటేశ్వరరావు

ఏలూరు టౌన్: మహిళల సంరక్షణ ధ్యేయంగా ఉన్నతాధికారుల ఆదేశాలతో పనిచేస్తానని ఏలూరు త్రీటౌన్ సీఐ వి.కోటేశ్వరరావు అన్నారు. సాధారణ బదిలీలలో భాగంగా బుధవారం ఆయన పోలీస్ స్టేషన్‌లో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. 2009 ఎస్సై బ్యాచ్‌కు చెందిన కోటేశ్వరరావు 2021 సంవత్సరంలో సీఐగా ఉద్యోగ ఉన్నతి పొందారు. అనంతరం విజయవాడ స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేశారు. విజయవాడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఆయన సాధారణ బదిలీల్లో ఏలూరు వచ్చారు. ఆయనను సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఏలూరు జిల్లాలో ఇదే మొదటిసారి పనిచేస్తున్నానని కోటేశ్వరరావు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో శాంతిభద్రతలు పరిరక్షించేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఆయన ఏలూరు సబ్ డివిజనల్ పోలీస్ అధికారి శ్రావణ్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఆర్‌బీఐ క్విజ్ పోటీల్లో పాల్గొనండి



ఆర్‌బీఐ క్విజ్ పోటీల పోస్టర్ విడుదల చేసిన కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): భారతీయ రిజర్వ్ బ్యాంక్ క్విజ్ పోటీల్లో అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు పాల్గొనాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి కోరారు. భారతీయ రిజర్వ్ బ్యాంక్ 90 సంవత్సరాలు పూర్తిచేసుకున్న నేపథ్యంలో నిర్వహిస్తున్న ఆన్‌లైన్‌లో క్విజ్ పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని జిల్లా కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ వెట్రిసెల్వి విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో డిగ్రీ చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. బాధ్యతాయుతమైన ఆర్థిక ప్రవర్తనను పెంపొందించుకోవడానికి యువతను ప్రోత్సహించడం, దాని ప్రజావగాహన ప్రచారాల ద్వారా డిజిటల్ ఫైనాన్షియల్ ఉత్పత్తులను సురక్షితమైన వినియోగానికి అలవాటు పడేలా చేయడం ఈ క్విజ్ ఉద్దేశమని వివరించారు. లీడ్ బ్యాంక్ మేనేజరు డి.నీలాద్రి మాట్లాడుతూ ఏ కళాశాల నుండైనా విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. హెచ్‌టీటీపీఎస్://డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ డాట్ ఆర్‌బీఐ90 క్విజ్ డాట్ ఇన్ వెబ్ సైట్‌లో ప్రతి ఒక్కరు రిజిస్టర్ చేసుకోవాలన్నారు. ఇద్దరు విద్యార్థులు ఒక టీమ్‌గా ఏర్పడి క్విజ్ పోటీల్లో రిజిస్టర్ చేసుకోవాలని వివరించారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలపై వినతి

ఏలూరు (టూటౌన్): మున్సిపల్ వర్కర్స్ సమస్యలను పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఏలూరు జిల్లా కార్యదర్శి భజంత్రీ శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని కోరారు. ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ భాను ప్రతాప్‌కి అభినందనలు తెలుపుతూ యూనియన్ ఏలూరు నగర సమితి ఆధ్వర్యంలో బుధవారం పుష్పగుచ్ఛం అందజేశారు. పలు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. పర్మినెంట్ కార్మికులకు జనరల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, 6, 12, 18, 24 సంవత్సరాలకు సంబంధించి ప్రత్యేక ఇంక్రిమెంట్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మెడికల్ లీవు బిల్లులు చెల్లించాలని, రిటైర్డ్ కార్మికులకు చెల్లించాల్సిన ప్రయోజనాన్ని తక్షణం చెల్లించాలని కోరారు. రిటైర్డ్ కార్మికులకు జీఐఎల్ చెల్లించాలని, చనిపోయిన కార్మికులకు ఏపీ, జీఐఎల్ చెల్లించాలన్నారు. మరణించిన కార్మికుల దహన క్రియల ఖర్చులకు నగదు చెల్లించాలని కోరారు. ఔట్‌సోర్సింగ్, ఆప్కాస్ కార్మికులకు బకాయి ఉన్న ఫిబ్రవరి నెల హెల్త్ అరియర్స్ తక్షణం చెల్లించాలన్నారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు, ఏలూరు నగర యూనియన్ నాయకులు యలగాడ దుర్గారావు, యలగాడ శివకుమార్, కసింకోట నాగేంద్ర, పుచ్చ శంకర్రావు, పైడి శంకరు, సోమాదుల కుమార్, ఇంటి అశోక్, గంట జానకిరామ్, అల్లం పెద్దిరాజు, బంగారు గణేష్, బండి సతీష్, కారే దాసు, అంత రాజ్ కిరణ్ పాల్గొన్నారు.

30న ఏలూరులో జాబ్ మేళా

ఏలూరు (టూటౌన్) : జిల్లా ఉపాధి కార్యాలయం(నేషనల్ కెరీర్ సర్వీస్), ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ యువజన సర్వీసుల శాఖ, సెట్‌వెల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 30న ఉదయం 10 గంటలకు ఏలూరు కలెక్టర్ కాంపౌండ్‌లో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సి.మధుభూషణరావు బుధవారం తెలిపారు. బజాజ్ క్యాపిటల్, ఎల్ఐసి ఆఫ్ ఇండియా, అమెజాన్(కెఎల్ గ్రూపు) ప్రతినిధులు హాజరు కానున్నట్లు చెప్పారు. జీతం నెలకు రూ.12 వేల నుంచి రూ.15 వేల వరకు ఇస్తారని, ఎన్నికైన వారికి మూడు నెలల శిక్షణ ఇస్తారన్నారు. అభ్యర్థులు ఇంటర్ లేదా డిగ్రీ చదివి 18 నుంచి 32 ఏళ్ల మధ్య వయసు ఉండాలన్నారు. ఎల్ఐసిలో ఏలూరు జిల్లా వ్యాప్తంగా పనిచేసేందుకు పదో తరగతి ఉత్తీర్ణులై 18 సంవత్సరాలు పైబడిన వారు అర్హులని పేర్కొన్నారు. అమెకజాన్(కెఎల్ గ్రూప్)లో వేర్ హౌస్ అసోసియేట్స్ ఉద్యోగానికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని, జీతం రూ.18000లతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 88868 82032 నెంబరులో సంప్రదించాలన్నారు.

విద్యుత్ అమరవీరుల స్ఫూర్తితో పోరాటం



పాత బస్టాండ్ సెంటర్‌లో నినదిస్తున్న వామపక్ష పార్టీల నాయకులు

ఏలూరు (టూటౌన్): విద్యుత్ ఉద్యమ అమరవీరుల స్ఫూర్తితో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా పోరాడతామని సీపీఎం, సీపీఐ, సీపీఐ ఎంఎల్ (న్యూడెమోక్రసీ) పార్టీలు స్పష్టం చేశాయి. ఈ మూడు పార్టీల నాయకులు నాటి విద్యుత్ ఉద్యమంలో అశువులు బాసిన అమరవీరులకు జోహార్లర్పిస్తూ, విద్యుత్ స్మార్ట్ మీటర్లను ఆపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ బుధవారం సాయంత్రం స్థానిక పాతబస్టాండ్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేశారు. సీపీఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు ఎ.రవి, మన్నవ కృష్ణ చైతన్య, సీపీఐ ఎంఎల్ (న్యూడెమోక్రసీ) జిల్లా నాయకులు బద్దా వెంకట్రావులు మాట్లాడారు. 2000వ సంవత్సరంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నాటి ప్రభుత్వం చేపట్టిన విద్యుత్ రంగం ప్రైవేటీకరణ, సంస్కరణలకు వ్యతిరేకంగా వామపక్ష పార్టీలు పెద్దఎత్తున ఉద్యమాన్ని నిర్వహించామని గుర్తు చేశారు. 2000 ఆగస్టు 28న హైదరాబాద్ బషీర్‌బాగ్ వద్ద జరిగిన పోలీసు కాల్పుల్లో ముగ్గురు యువకులు చనిపోయారని వివరించారు. ఆ ఉద్యమం తర్వాత ఏ ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచలేదని తెలిపారు. ఎన్నికలకు ముందు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి పార్టీలు తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని, స్మార్ట్ మీటర్లను నిలుపుదల చేస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే కూటమి ప్రభుత్వం అదానీ కంపెనీ స్మార్ట్ మీటర్ల భారాన్ని ప్రజలపై రద్దుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల ప్రక్రియను వెంటనే నిలుపుదల చేయాలని, విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్ అందించి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. పేద, మధ్యతరగతి ప్రజానీకానికి విద్యుత్ చార్జీల స్లాబ్‌లలో ధరలు తగ్గించాలన్నారు. కార్యక్రమంలో ఆయా పార్టీ నాయకులు పి.రామకృష్ణ, వై.నాగేంద్ర, బి.జగన్నాథరావు, బండి వెంకటేశ్వరరావు, పల్లి గంగరాజు, బండి నాగేశ్వరరావు, గంట శ్రీను, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

కుల ధ్రువీకరణల పరిశీలన



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ధాత్రిరెడ్డి

ఏలూరు రూరల్ : ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి కుల ధ్రువీకరణ పత్రాలను తనిఖీ చేశారు. ఏలూరు అర్బన్ పరిధిలోని వెంకటాపురంలో పలువురు ఇళ్లకు వెళ్లి అధికారులు మంజూరు చేసిన సర్టిఫికెట్లు స్వయంగా పరిశీలించారు. ఈ పత్రాల వల్ల కలిగిన ప్రయోజనాలు, దరఖాస్తుదారుల వరాలు, వారి కులం గురించి ఆరా తీశారు. సర్టిఫికెట్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జేసీ వెంట ఆర్డీఓ కె ఖాజావలి, వీఆర్వో ప్రసాద్ ఉన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	34
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	38
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	16
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	35

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	21.45	4820	30
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	21.15	4822	33
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	30
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	28
ఏలూరు–జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	27
ఏలూరు–బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	29
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	30
ఏలూరు – ఈసీఐఎల్	22.30	4814	20
ఏలూరు – తిరుపతి	16.00	4830	32

ఆర్డీఓ ఆర్డర్లను తక్షణం నిలిపివేయాలి

ఏలూరు (టూటౌన్): ఏజెన్సీలో 1/70, ఎల్‌టీఆర్, పీసా చట్టాలకు విరుద్ధంగా ల్యాండ్ కన్వెన్షన్ పేరుతో ఆర్డీఓ జారీ చేసిన ఆర్డర్లను తక్షణం నిలుపుదల చేయాలని సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో కొందరు గిరిజనేతరులు వ్యవసాయ భూమిని ల్యాండ్ కన్వెన్షన్ పేరుతో ఆర్డీఓ నుంచి అనుమతులు తీసుకొని ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. వీటిని తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. ఆర్డీఓ ఇస్తున్న ల్యాండ్ కన్వెన్షన్ ఆర్డర్లు ఏజెన్సీ ప్రాంత చట్టాలకు పూర్తిగా విరుద్ధమన్నారు. దీన్ని సాకుగా చూపి చేపట్టే అక్రమ నిర్మాణాలను ఆపాలన్నారు. దీనిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ప్లాట్ల అమ్మకాలు తక్షణమే ఆపాలని ఐటీడీఏ పీఓ, కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకొని చర్యలు చేపట్టాలని కోరారు. లేని పక్షంలో ఏజెన్సీ ప్రాంతంలో అన్యాయానికి గురవుతున్న గిరిజనులను చైతన్యం చేసి ఆందోళనలు చేపడతామని రవి హెచ్చరించారు.

పరస్పర గౌరవంతోనే శాంతి స్థాపన



సమావేశంలో మాట్లాడుతున్న తారిఖ్ అహ్మద్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సర్వ ధర్మాల అవతార పురుషులను పరస్పరం గౌరవించుకున్నప్పుడే ప్రపంచంలో శాంతిని స్థాపించవచ్చని అహ్మదియ్య ముస్లిం కమ్యూనిటీ ఇండియా సంస్థ ఏలూరు జిల్లా ఇన్‌చార్జి కె.తారిఖ్ అహ్మద్ అన్నారు. బుధవారం స్థానిక లేడీస్ క్లబ్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. అహ్మదియ్య ముస్లిం కమ్యూనిటీని హజ్రత్ మిర్జా గులామ్ అహ్మద్ 1889వ సంవత్సరంలో పంజాబ్‌లోని ఖాదియాన్ నగరంలో స్థాపించారని, ఇది 200కు పైగా దేశాల్లో వ్యాపించి ఉందని చెప్పారు. మత సామరస్యంతో కూడిన నవసమాజ నిర్మాణం , ప్రపంచ శాతి కోసం పని చేస్తోందని వివరించారు. అందరిని ప్రేమించు.. ఎవ్వరినీ ద్వేషించకు అనే నినాదంతో హ్యూమానిటీ ఫస్ట్ శాఖ ఆధ్వర్యంలో మానవ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రపంచ శాంతికి శాంతి సమ్మేళనాలు, సెమినార్లు, చర్చాగోష్టి, విద్యావేత్తల, మేధావుల సలహాలు తీసుకొని, అనేక రకాల కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వివరించారు. సమావేశంలో సంస్థ రాష్ట్ర ప్రజా సంబంధాల ప్రతినిధి ముహమ్మద్ జావేద్ అహ్మద్ పాషా పాల్గొన్నారు.

దోమల నివారణ చర్యలు

ఏలూరు (టూటౌన్): స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా నగరపాలక సంస్థ పరిధిలోని 17వ డివిజన్‌లో దోమల నివారణ కార్యక్రమం చేపట్టామని మున్సిపల్ కమిషనర్ ఎ.భానుప్రతాప్ తెలిపారు. పడమర వీధి, ఎంఆర్‌డీ బలరాం రోడ్డు, ఇండియన్ గ్యాస్ గోడౌన్ రోడ్డు, తదితర ప్రాంతాల్లో దోమల లార్వా నిర్మూలనకు స్ప్రేయింగ్, మురుగు కాలువ కల్వర్టు కింద ఫాగింగ్, ఖాళీ స్థలాల్లో ఉన్న నిల్వ నీటిలో ఆయిల్ బాల్స్ వేయించామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మాలతి, నాయకులు ఎం త్రినాథ్, మలేరియా ఇన్‌స్పెక్టర్ దత్తి వేణుగోపాల్‌స్వామి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వి.బాలస్వామి, ఆరోగ్య కార్యదర్శి, ఆశా కార్యకర్తలు, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

రహదారికి శంకుస్థాపన

పెదపాడు: మండలంలోని తోటగూడెం–పునుకొల్లు గ్రామ రహదారికి బుధవారం ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ శంకుస్థాపన చేశారు. పునుకొల్లులో ఈ కార్యక్రమం నిర్వహించారు.